నెల ముందే 'గుండెపోటు' సంకేతాలు

శరీరం 6 విధాలుగా హెచ్చరిస్తుంది
స్పందించి చికిత్స తీసుకొంటే మేలు
అమెరికన్ హార్ట్ అసోసియేషన్ వెల్లడి

ఆధునిక జీవనశైలితో ప్రస్తుతం గుండెజబ్బులు తీవ్రమయ్యాయి. యువకులు, చిన్నపిల్లలు కూడా గుండెపోటుతో కుప్పకూలుతున్న ఘటనలు నిత్యం చూస్తున్నాం. దేశంలో ఏటా 30 వేల మంది గుండెపోటుకు బలవుతున్నట్టు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. గుండెపోటును ముందస్తుగా గుర్తించకపోవడంతోనే మరణాలరేటు ఎక్కువవుతున్నట్టు నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో గుండెపోటు వచ్చే ప్రమాదాన్ని శరీరంలో వచ్చే ఆరు మార్పులతో నెల ముందుగానే పసిగట్టవచ్చని 'అమెరికన్ హార్ట్ అసోసియేషన్' తాజాగా వెల్లడించింది. (స్పెషల్ టాస్క్ బ్యూరో)

భారత్‌లో ఏటా గుండెపోటుతో 30,000 మరణాలు

హెచ్చరికలు ఇవి.. 6

ఛాతీ మధ్యలో ఒత్తిడి
ఉన్నట్టుండి ఛాతీ మధ్య భాగంపై ఒత్తిడి పెరుగుతుంది. అది క్రమంగా భరించలేని నొప్పిగా మారుతుంది. ఇది కొద్ది నిమిషాలపాటు కొనసాగుతుంది.

తల తిరగడం
శరీరానికి అవసరమైన నీరు, ఆహారం క్రమంగా తీసుకొన్నప్పటికీ తరుచూ తల గిర్రున తిరుగడం జరుగుతుంది. గుండెకు సరఫరా అయ్యే రక్తం మోతాదు తగ్గడంతోనే ఇది జరుగుతుంది.

ఊపిరి ఆడకపోవడం
ఉన్నట్టుండి ఊపిరి తీసుకోవడం కష్టమవుతుంది. అదే సమయంలో ఛాతీనొప్పి కూడా రావొచ్చు.

మిగతా శరీర భాగాల్లో నొప్పి
గుండెనొప్పి వచ్చే ప్రమాదమున్నప్పుడు ఛాతీతో పాటు నడుము, భుజాలు, చేతులు, మెడ, దవడల్లో కూడా నొప్పి కలుగుతుంది.

వికారం, అజీర్ణం
కడుపులో వికారం, తిన్న ఆహారం జీర్ణం కాకపోవడం, తరుచూ వాంతులు కావడం, పొట్ట ఉబ్బరంగా మారడం, గుండెలో మంట వంటివి కొనసాగుతాయి.

విపరీతంగా చెమటపోయడం
వ్యాయామం చేసిన తర్వాత చెమటపోయడం సహజం. అయితే, అవేమీ చేయనప్పటికీ విపరీతంగా చెమట పోయడం, శరీరం చల్లబడటం జరుగుతుంది. గుండెపోటు వచ్చే సూచన ఉన్నప్పుడు దాన్ని అడ్డుకోవడానికి నాడీవ్యవస్థ యాక్టివ్‌గా పనిచేయడంతోనే విపరీతంగా చెమట వస్తుందని వైద్యులు చెప్తున్నారు.

హార్ట్‌ఎటాక్ టెస్టు ఇంట్లోనే..
గుండెపోటు వచ్చే ముప్పును ఇంట్లోనే ఉంటూ సులభంగా కనిపెట్టే టెస్టును స్వీడిష్ పరిశోధకులు ఇటీవల అభివృద్ధి చేశారు. ప్రత్యేక అల్గారిథమ్‌తో పనిచేసే ఈ టెస్ట్‌లో భాగంగా పరిశోధకులు 14 సులభమైన ప్రశ్నలను సిద్ధం చేశారు. వ్యక్తి వయసు, లింగం, బరువు, నడుము చుట్టు కొలత, ధూమపానం అలవాటు, రక్త పోటు, రక్తంలో కొవ్వుల స్థాయి, మధుమేహం, గతంలో కుటుంబసభ్యులకు గుండెజబ్బులు ఉన్నాయా? లేదా? వంటి ప్రశ్నలతో ఈ టెస్ట్ ఉంటుంది. దీని ఫలితాలు 65 శాతం కచ్చితమైనవని పరిశోధకులు పేర్కొన్నారు.



మాజీ అగ్నివీర్లకు 10% రిజర్వేషన్లు
సీఐఎస్ఎఫ్, బీఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్ చీఫ్‌ల ప్రకటన

న్యూఢిల్లీ, జూలై 11: అగ్నిపథ్ పథకంపై విమర్శలు వెల్లువెత్తుతున్న క్రమంలో సీఐఎస్ఎఫ్, బీఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్ అధిపతులు కీలక ప్రకటన చేశారు. కేంద్ర హోం శాఖ నిర్ణయాన్ని అనుసరించి, కానిస్టేబుల్ నియామకాల్లో మాజీ అగ్నివీర్లకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించనున్నట్టు వెల్లడించారు. భవిష్యత్తులో చేపట్టే రిక్రూట్‌మెంట్లలో ఈ రిజర్వేషన్ అమలు చేస్తామన్నారు. అలాగే వయస్సు, శరీర దారుఢ్య పరీక్షల్లో సైతం వారికి మినహాయింపు ఉంటుందని చెప్పారు. అయితే వారిని నియమించిన తర్వాత కన్వర్షన్ ట్రైనింగ్ ఉంటుందన్నారు. తొలి ఏడాది బ్యాచ్‌లకు వయసు మినహాయింపు అయిదేండ్లు, తర్వాతి ఏడాది బ్యాచ్‌లకు మూడేండ్లు ఉంటుందని చెప్పారు.

తల్లిదండ్రులతో గడిపేందుకు ప్రత్యేక సెలవులు
ప్రకటించిన అస్సాం ప్రభుత్వం

గువాహటి: తల్లిదండ్రులు, అత్తామామలతో గడిపేందుకు ప్రభుత్వ ఉద్యోగులకు అస్సాం ప్రభుత్వం రెండు రోజులు ప్రత్యేక సెలవులు ప్రకటించింది. నవంబర్ 6,8 తేదీల్లో రెండు ప్రత్యేక క్యాజువల్ లీవ్‌లు ఇస్తున్నట్టు తెలిపింది. ఈ సెలవులు కేవలం తల్లిదండ్రులు, అత్తమామలతో గడిపేందుకు మాత్రమేనని, ఇతర మార్గాల్లో ఎంజాయ్ చేసేందుకు కాదని స్పష్టం చేసింది. తల్లిదండ్రులు, అత్తమామలు ఉన్న ఉద్యోగులు మాత్రమే ఈ సెలవులు వినియోగానికి అర్హులని ఉత్తర్వుల్లో పేర్కొంది.

కర్ణాటక గ్రామంలో అంతుచిక్కని వ్యాధి

బెంగళూరు: కర్ణాటకలోని దేవగొండ నహళ్లి గ్రామస్థులను ఓ అంతుబట్టని వ్యాధి దాదాపు 45 రోజుల నుంచి పీడిస్తున్నది. కాళ్లు వాచిపోవడం, విపరీతమైన ఒళ్లు నొప్పులతో అనేక మంది బాధపడుతున్నారు. ఈ వ్యాధి సోకినవారు తమ రోజువారీ పనులను చేసుకోలేకపోతున్నారు. కొందరైతే మంచానికి పరిమితమయ్యారు. ఈ గ్రామంలో జ్వరం, కీళ్ల నొప్పులు, డెంగ్యూ వ్యాధి కూడా ప్రబలింది. బాధితులు ప్రభుత్వ, ప్రైవేటు దవాఖానాల్లో చికిత్స చేయించుకుంటున్నప్పటికీ ఉపశమనం దొరకడం లేదు. దీనిపై తాలూకా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సీమ మాట్లాడుతూ, క్రమం తప్పకుండా లార్వా సర్వే చేస్తున్నామన్నారు.

ఐఏఎస్ పూజా ఖేడ్కర్‌పై దర్యాప్తునకు ప్యానల్

న్యూఢిల్లీ: వివాదాస్పద చర్యలతో వార్తల్లో నిలిచిన ట్రైనీ ఐఏఎస్ అధికారి పూజా ఖేడ్కర్‌పై విచారణకు కేంద్రం ఒక ప్యానల్‌ను ఏర్పాటు చేసింది. తన శారీరక అంగ వైకల్య క్యాటగిరీ, ఓబీసీ కోటాను దుర్వినియోగం చేసి ఐఏఎస్ సర్వీస్ సాధించినట్టు పూజాపై వచ్చిన ఆరోపణలపై కమిటీ విచారణ చేస్తుంది. వివాదాస్పద ప్రవర్తన కారణంగా బదిలీ అయిన ఖేడ్కర్ గురువారం వాసిం జిల్లా కలెక్టరేట్‌లో అసిస్టెంట్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. కాగా, ట్రైనీ కలెక్టర్‌గా ఉండగానే తనకు ప్రత్యేక ఛాంబర్ కావాలనడం, తన ప్రైవేట్ ఆడీ కారుకు సైరన్, ప్రభుత్వ స్టిక్కర్, వీఐపీ నెంబర్ ప్లేట్లను అనుమతి లేకుండా వాడినట్టు ఆరోపణలు రావడంతో పుణె నుంచి ఆమెను బదిలీ చేశారు.

ఆత్మహత్యల భారతం

ప్రపంచంలో ఎక్కువ బలవన్మరణాలు మనదేశంలోనే

- 2022లో 1.71 లక్షల మంది ఆత్మహత్య
- ఒత్తిడి, నిరాశ నిస్పృహలతో కఠిన నిర్ణయం
- బలయ్యేది ఎక్కువగా పేదలు, రోజు కూలీలే
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ఆరోగ్య నిపుణులు

న్యూఢిల్లీ, జూలై 11: దేశంలో ఆత్మహత్యలు చేసుకుంటున్న వారి సంఖ్య పెరిగిపోతున్నది. ప్రపంచంలో ఎక్కువ బలవన్మరణాలు నమోదవుతున్నది భారత్‌లోనే అని గణాంకాలు చెప్తున్నాయి. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో(ఎన్‌సీఆర్‌బీ) ఇటీవల విడుదల చేసిన నివేదిక ప్రకారం 2022 సంవత్సరంలో దేశంలో 1.71 లక్షల మంది ఆత్మహత్య చేసుకున్నారు. 2021 కంటే ఇది 4.2 శాతం, 2018 కంటే 27 శాతం ఎక్కువ. గతంలో ఎన్నడూ లేని విధంగా లక్ష జనాభాకు ఆత్మహత్యల రేటు 12.4గా నమోదయ్యింది. ఈ నేపథ్యంలో దేశంలో పెరుగుతున్న ఆత్మహత్యల పట్ల నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే ఇప్పుడు దేశం ఎదుర్కొంటున్న అతిపెద్ద ప్రజారోగ్య సంక్షోభంగా పేర్కొంటున్నారు. సుప్రీంకోర్టు సైతం ఈ విషయంపై ఆందోళన వ్యక్తం చేసింది. దేశంలో ఆత్మహత్యల నివారణకు తీసుకునే చర్యలపై 4 వారాల్లోగా నివేదిక ఇవ్వాలని కేంద్రాన్ని ఆదేశించింది.



మానసిక సమస్యలే ప్రధాన కారణం

దేశంలో పెరుగుతున్న ఆత్మహత్యలకు మానసిక సమస్యలే ప్రధాన కారణాలని వైద్య నిపుణులు చెప్తున్నారు. పని, ఆర్థిక అంశాలు, ఆరోగ్యం, కుటుంబ సంబంధాలు వంటి సమస్యల కారణంగా మొదలయ్యే ఒత్తిడి క్రమంగా మనిషిని బలహీనం చేస్తున్నదని అభిప్రాయపడుతున్నారు. ముందుగా ఒత్తిడి మొదలై ఆందోళన, నిరాశగా మారుతుందని, ఇవి ఆత్మహత్యలకు కారణమవుతాయని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైకియాట్రి అండ్ బిహేవియరల్ సైన్స్ వైస్ చైర్‌పర్సన్ రాజీవ్ మెహతా తెలిపారు.

> ఇప్పుడు దేశ ప్రజారోగ్య వ్యవస్థ ఎదుర్కొంటున్న అతిపెద్ద సంక్షోభం ఆత్మహత్యలే.యువత మరణాలకు ప్రధాన కారణం ఇదే. తీవ్రమైన ఒత్తిడి కారణంగానే ఆత్మహత్య చేసుకుంటున్నారు. ఆర్థిక ఇబ్బందులు, ఆరోగ్య, వ్యక్తిగత సమస్యలు ఎదుర్కొనే పేదలే ఎక్కువగా బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఒంటరితనం కూడా ప్రధాన కారణమే.
>
> – శ్యామ్ భట్, చైర్‌పర్సన్, లీవ్‌లవ్‌లాఫ్

దేశంలో ఆత్మహత్యలు (ఎన్‌సీఆర్‌బీ గణాంకాలు)

2018	–	1,34,516
2019	–	1,39,123
2020	–	1,53,052
2021	–	1,64,033
2022	–	1,70,921

బిగ్గరగా నవ్వాల్సిందే!

- రోజులో ఒక్కసారైనా ఇలా చేయాలి
- జపాన్‌లో కొత్త నిబంధన
- గట్టిగా నవ్వితే గుండె సమస్యలు దూరం అవుతాయన్న 'లాఫర్ స్టడీ'

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూలై 11 (నమస్తే తెలంగాణ): 'నవ్వు నాలుగు విధాల చేటు' అని మన పెద్దవాళ్లు అంటే, నవ్వడం నలభై విధాల మేలు అని జపాన్ ప్రభుత్వం అంటున్నది. అనడమే కాదు.. ప్రతీ పౌరుడు రోజులో కనీసం ఒక్కసారైనా బిగ్గరగా నవ్వడం తప్పనిసరిని చేస్తూ ఉత్తర జపాన్‌లోని యమగటా స్థానిక యంత్రాంగం కొత్త నిబంధనను కూడా తీసుకొచ్చింది. బిగ్గరగా నవ్వితే, గుండె సమస్యలు తగ్గుముఖం పడుతాయని వారు చెప్తున్నారు. ఈ మేరకు యమగటా యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్ పరిశోధకుల 'లాఫర్ స్టడీ'ని ఉదహరిస్తున్నారు.

మానసిక-శారీరక ప్రశాంతత

40 ఏండ్ల కంటే తక్కువ వయసున్న 17,152 మందిపై యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్ శాస్త్రవేత్తలు విస్తృతస్థాయి పరిశోధనలు చేశారు. వారంలో ఎన్నిసార్లు బిగ్గరగా నవ్వుతారంటూ? ఓ ప్రశ్నావళిని సిద్ధంచేశారు. సమాధానాలను రాబట్టిన తర్వాత కొన్నేండ్లు వారి ఆరోగ్యాన్ని విశ్లేషించారు. వారంలో ఒక్కసారి కూడా బిగ్గరగా నవ్వని వారికి గుండె సమస్యలు ఎక్కువగా వచ్చినట్టు గుర్తించారు. ఒకటి కంటే ఎక్కువసార్లు బిగ్గరగా నవ్వినవారికి గుండె సమస్యలు తక్కువగా వచ్చినట్టు, రోజూ బిగ్గరగా నవ్వేవారికి గుండె సమస్యలు పెద్దగా ఎదురుకాలేదని తెలిపారు. బిగ్గరగా నవ్వితే, శరీరంలోని నాడీలు, కండరాలు ఉత్తేజితమవుతాయని, రక్త ప్రసరణ చురుగ్గా సాగుతుందని, మానసిక-శారీరక ప్రశాంతత కలుగుతుందని నిపుణులు చెబుతున్నారు. గుండె సమస్యలు ఉన్నవారికి 'లాఫింగ్ థెరపీ' ఇస్తున్న విషయాన్ని గుర్తు చేస్తున్నారు.

గుజరాత్‌లో నకిలీ దవాఖాన!
బీజేపీ పాలిత రాష్ట్రంలో బయటపడ్డ మరో బాగోతం

అహ్మదాబాద్, జూలై 11: గుజరాత్‌లో నకిలీలలు బయటపడుతూనే ఉన్నాయి. ఇప్పటికే రాష్ట్రంలో నకిలీ ప్రభుత్వ కార్యాలయం, నకిలీ టోల్‌ప్లాజాను గుర్తించగా తాజాగా నకిలీ దవాఖాన గుట్టు రట్టయ్యింది. అహ్మదాబాద్ జిల్లాలోని బవ్ల తాలుకాలో ఉన్న కేరళ గ్రామంలో అనన్య మల్టీ స్పెషాలిటీ పేరుతో ఒక దవాఖాన కొన్నాళ్లుగా నడుస్తున్నది. ఇటీవల ఓ బాలిక ఇక్కడ చికిత్స పొందుతూ మరణించింది. అయితే, దవాఖానకు తెచ్చే వరకు బాలిక ఆరోగ్యం కాస్త స్థిమితంగానే ఉందని, దవాఖానకు వచ్చిన తర్వాతనే సరైన వైద్యం చేయనందుకు మరణించిందని ఆమె తల్లిదండ్రులు ఆరోపించారు. దీంతో వైద్య శాఖ అధికారులు దవాఖానకు వెళ్లగా నకిలీ బాగోతం బయటపడింది. దవాఖాన వేరే వైద్యుడి పేరు మీద రిజిస్టర్ కాగా మెహల్ చావ్‌డా అనే వైద్యరంగానికి సంబంధం లేని వ్యక్తి దవాఖానను నడిపిస్తున్నట్టు బయటపడింది. దీంతో దవాఖానను సీజ్ చేశారు.

మణిపూర్ నుంచి తొలిసారి సుప్రీం జడ్జి

జస్టిస్ కోటీశ్వర్ సింగ్ జస్టిస్ మహదేవన్

న్యూఢిల్లీ: మణిపూర్ నుంచి తొలిసారిగా ఒకరు సుప్రీంకోర్టు న్యాయమూర్తి కాబోతున్నారు. సర్వోన్నత న్యాయస్థానంలో జడ్జీలుగా నియమించేందుకు చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని కొలీజియం గురువారం కేంద్రానికి ఇద్దరి పేర్లను సిఫార్సు చేసింది. అందులో మణిపూర్‌కు చెందిన, ప్రస్తుతం జమ్ము కశ్మీర్, లఢక్ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా ఉన్న ఎన్ కోటీశ్వర్ సింగ్, మద్రాస్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మహదేవన్ ఉన్నారు. సింగ్‌ను సుప్రీంకోర్టు జడ్జీగా నియమిస్తే ఈశాన్య రాష్ట్రానికి చెందిన వ్యక్తికి తొలిసారిగా ప్రాతినిధ్యం కల్పించినట్టు అవుతుందని కొలీజియం ఒక ప్రకటనలో పేర్కొంది. తమిళనాడుకు చెందిన మహదేవన్ వెనుకబడిన వర్గాలకు చెందిన వారు. సుప్రీంకోర్టులో మొత్తం 34 మంది న్యాయమూర్తులకు ఇటీవల ఇద్దరు పదవీ విరమణ చేయడంతో ఆ స్థానాల భర్తీ కోసం కొలీజియం తాజా సిఫారసులు చేసింది.

థెర్మాక్స్ గ్లోబల్ అనే ప్రైవేట్ కంపెనీ నిర్వహించిన వాకిన్ ఇంటర్వ్యూకు పోటెత్తిన నిరుద్యోగులు

గుజరాత్ మాడల్ అంటే గిదేనా?

ఇంటర్వ్యూకు పిలిచిన ప్రైవేటు కంపెనీ పోటెత్తిన అభ్యర్థులు.. కూలిన రెయిలింగ్

అహ్మదాబాద్, జూలై 11: బీజేపీ పాలిత గుజరాత్‌లో ఓ ప్రైవేటు కంపెనీ నిర్వహించిన వాకిన్ ఇంటర్వ్యూకు నిరుద్యోగులు పోటెత్తారు. 10 పోస్టులను భర్తీ చేయడానికి ఇంటర్వ్యూలు నిర్వహించగా దాదాపు 1,800 మంది వరకు తరలివచ్చారు. అభ్యర్థులు బారులు తీరిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇంతకాలంగా బీజేపీ చెప్పున్న గుజరాత్ మాడల్ ఇదేనా అంటూ నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. థెర్మాక్స్ గ్లోబల్ అనే సంస్థ మంగళవారం అంక్లేశ్వర్‌లోని ఓ హోటల్‌లో హాల్‌ను అద్దెకు తీసుకొని ఇంటర్వ్యూలు నిర్వహించింది. దీని గురించి ముందుగానే పేపర్లలో ప్రకటన ఇచ్చింది. దీంతో వందల మంది అభ్యర్థులు హోటల్ ముందు బారులు తీరారు. అభ్యర్థుల మధ్య తోపులాటతో హోటల్ రెయిలింగ్ ఊడిపోయి పలువురు కింద పడిపోయారు.

నరేంద్ర మోదీ నిరుద్యోగ నమూనా

గుజరాత్ మాడల్ బట్టబయలైందని కాంగ్రెస్ విమర్శించింది. నరేంద్ర మోదీ ఈ నిరుద్యోగ నమూనానే దేశమంతా రుద్దుతున్నారని పేర్కొన్నది. దీనికి బీజేపీ గుజరాత్ శాఖ కౌంటర్ ఇచ్చింది. ఈ కంపెనీ ఇంటర్వ్యూలకు పిలిచిన ప్రకటనలోనే అనుభవం కలిగిన వారికి మాత్రమే అని స్పష్టంగా పేర్కొన్నదని, కాబట్టి వచ్చిన అభ్యర్థులంతా నిరుద్యోగులు కాదని 'ఎక్స్'లో చెప్పుకొచ్చింది.

డబుల్ ట్రబుల్ ఇంజిన్

సర్టిఫికెట్ కన్నా సంప్రదాయాలే ముఖ్యం
హిందూ వివాహంపై అలహాబాద్ హైకోర్టు తీర్పు

లక్నో: హిందువుల మధ్య జరిగే పెండ్లికి చట్టబద్ధత రావాలంటే, ఆ వివాహం హిందూ సంప్రదాయాల ప్రకారం జరిగి ఉండాలని అలహాబాద్ హైకోర్టు లక్నో ధర్మాసనం తీర్పు చెప్పింది. సంప్రదాయబద్ధంగా పెండ్లి జరగకుండా, కేవలం వివాహ ధ్రువపత్రం మాత్రమే ఉంటే, ఆ వివాహం చెల్లదని స్పష్టం చేసింది. పిటిషనర్ వాదన ప్రకారం, ఆమె, ఆమె తల్లి ఓ మత గురువును అనుసరిస్తున్నారు. ఆ గురువు ఈ మహిళలిద్దరి చేత తెల్ల కాగితాలపై సంతకాలు చేయించారు. తన సంస్థలో రెగ్యులర్ మెంబర్స్‌గా చేర్చుకోవడానికి ఈ సంతకాలు తీసుకుంటున్నట్లు మాయ మాటలు చెప్పారు. కానీ కొంత కాలం తర్వాత తన తండ్రి వద్దకు ఆ గురువు వెళ్లి, 'మీ కుమార్తెను నేను ఆర్య సమాజ్‌లో పెండ్లి చేసుకున్నాను. వివాహం రిజిస్ట్రేషన్ అయింది' అని చెప్పారు. దీంతో ఈ వివాహాన్ని రద్దు చేయాలని బాధిత యువతి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. విచారించిన కోర్టు పై విధంగా తీర్పు చెప్పింది.

పాల కల్తీని ఆవిరితో గుర్తించొచ్చు!

ఇంట్లోనే సులభంగా చేసుకొనే వినూత్న పద్ధతి.. అభివృద్ధి చేసిన బీహెచ్‌యూ పరిశోధకులు

న్యూఢిల్లీ, జూలై 11: ప్రస్తుతం సర్వం కల్తీమయంగా మారింది. పాలను కూడా కొందరు కేటుగాళ్లు కల్తీ చేస్తున్నారు. డిటర్జెంట్ పౌడర్, యూరియా, వెజిటెబుల్ ఆయిల్, నల్లా నీళ్లకు కొన్ని కెమికల్స్ కలిపి సింథటిక్ పాలను తయారుచేస్తున్నారు. ఇలాంటి సింథటిక్ పాలు ఆరోగ్యానికి హాని కలిగిస్తాయి. దీంతో కల్తీ పాల పట్ల ప్రజల్లో ఆందోళన నెలకొన్నది. ఈ నేపథ్యంలో ఇంట్లోనే సులువుగా కల్తీ పాలను గుర్తించే సరికొత్త పరీక్షను బనారస్ హిందూ విశ్వవిద్యాలయం, సిక్కిం విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధక బృందం కనిపెట్టింది.

ఎలా కనిపెట్టవచ్చంటే?

మెడికల్ సిరంజీలో పాలు తీసుకోవాలి. సిరంజీ సాయంతో ఓ పాల చుక్కను చిన్న గాజు పలకపై వేయాలి. కాసేపు వేచిచూడాలి. పాలు ఆవిరవుతున్న క్రమంలో పాలలోని కొన్ని కణాలు ఒకదానికి ఒకటి దగ్గరకు చేరి చివరకు పాల చుక్క అంచున ఒక చైన్‌లాగా ఏర్పడతాయి. అలా జరిగితే ఆ పాలు సింథటిక్ పాలని భావించవచ్చు. సాంకేతికంగా దీన్ని విశ్లేషించాలనుకొంటే.. స్మార్ట్‌ఫోన్‌లో ఆ ఫొటో తీసి తాము అభివృద్ధి చేసిన మెషీన్ లెర్నింగ్ విధానంతో పాల కల్తీని గుర్తించవచ్చని పరిశోధకులు చెప్తున్నారు.

ఆ పరీక్షకు.. దీనికి తేడా ఏంటంటే?

పాలు స్వచ్ఛమైనవా? కావా? అని తెలుసుకోవడానికి అయోడిన్ పరీక్ష వంటివి చేస్తుంటారు.



సింథటిక్ పాల చుక్క అంచుల్లో చైన్ మాదిరిగా ఏర్పడిన కణాలు

పాలలో నీటి శాతం, స్టార్చ్ మోతాదు ఎంత ఉన్నది అనేది దీంతో తెలుస్తుంది. అయితే సింథటిక్ పాలను ఈ పద్ధతుల్లో కచ్చితత్వంతో గుర్తించలేము. అయితే, తమ మెషీన్ లెర్నింగ్ విధానంతో సింథటిక్ పాలను 96.7% కచ్చితత్వంతో గుర్తించవచ్చని పరిశోధకులు చెబుతున్నారు. ఈ విధానాన్ని త్వరలోనే అందరికీ అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు.

ఇది మన దేశీ స్పేస్‌స్టేషన్

- ఐఎస్ఎస్‌కు దీటుగా అన్నిరకాల ఏర్పాట్లు
- ఏకకాలంలో 16 మంది కూడా ఉండొచ్చు
- 2027 నాటికి సిద్ధం: బెంగళూరు స్టార్టప్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూలై 11 (నమస్తే తెలంగాణ): అంతరిక్ష వ్యోమగాములు సేదతీరడానికి, పరిశోధనలు నిర్వహించడానికి అంతర్జాతీయ అంతరిక్ష పరిశోధన కేంద్రం (ఐఎస్ఎస్) సేవలు అందిస్తున్నది. అమెరికా, రష్యా, జపాన్, ఐరోపా, కెనడా సంయుక్తంగా దీన్ని నిర్వహిస్తున్నాయి. అయితే, వినువీధుల్లో అద్భుత విజయాలు సాధిస్తున్న భారత్‌కు ఇప్పటికీ సొంతంగా స్పేస్‌స్టేషన్ లేదు. భారతీయ అంతరిక్ష స్టేషన్ (బీఏఎస్) పేరిట ఇస్రో ఓ స్పేస్‌స్టేషన్‌ను నిర్మించాలనుకొన్నప్పటికీ అది అందుబాటులోకి రావడానికి 2035 వరకూ వేచిచూడాలని కేంద్రప్రభుత్వమే వెల్లడించింది. ఇలాంటి సమయంలో బెంగళూరుకు చెందిన ఆకాశలబ్ధి అనే స్టార్టప్ కంపెనీ స్పేస్‌స్టేషన్ నిర్మాణానికి సిద్ధమైంది.

ఎప్పుడు అందుబాటులోకి?

2027నాటికి ఈ స్పేస్‌స్టేషన్‌ను అందుబాటులోకి తీసుకురావడానికి ప్రణాళికలు సిద్ధంచేసినట్టు కంపెనీ సీఈవో సిద్ధార్థ్ జేనా తెలిపారు. ఈ మేరకు ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్‌తో జట్టుకట్టనున్నట్టు తెలిపారు. తమ స్పేస్‌స్టేషన్‌లో ఏకకాలంలో 6-16 మంది ఉండొచ్చని, అంతరిక్షంలోని గ్రహ శకలాలు, రేడియేషన్ నుంచి రక్షించే అన్నిరకాల ఏర్పాట్లు ఐఎస్ఎస్‌కు దీటుగా తమ స్పేస్‌స్టేషన్‌లో ఉంటాయని పేర్కొన్నారు. ఐఎస్ఎస్‌తో పోలిస్తే తమ స్టేషన్ ఎంతో చవకైనదని వెల్లడించారు. 2030లో ఐఎస్ఎస్ జీవితకాలం ముగియనున్నది. దీన్ని కూల్చేసే కాంట్రాక్ట్‌ను కూడా నాసా.. స్పేస్‌ఎక్స్‌కు ఇవ్వడం గమనార్హం.

ఏమిటీ స్పేస్‌స్టేషన్?
రోదసి ప్రయోగాలు ఊపందుకొన్న నేపథ్యంలో వ్యోమగాములు పరిశోధనలు చేసుకోవడానికి, రోదసి యాత్రికులు సేదతీరడానికి ఆకాశలబ్ధి సంస్థ 'ఎక్స్‌పాండబుల్ స్పేస్ హ్యాబిటేట్' (ఎక్స్ఎస్‌హెచ్) పేరిట ఓ స్పేస్‌స్టేషన్‌ను నిర్మించనున్నది. 2023 నవంబర్‌లోనే దీనికి సంబంధించిన ప్రొటోటైప్ 'అంతరిక్ష హబ్' డిజైన్‌ను ఐఐటీ-రూర్కీ, ఐఐఎస్-బెంగళూరులో సిద్ధంచేసింది.